# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 25-05-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆరో విడత ఎన్నికల పోలింగ్‌లో ఈరోజు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఢిల్లీలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.**

2. **జూన్ 4 వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనున్న క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పోలీసు శాఖ పేర్కొంది.**

3. **ఐఐటీల్లో ప్రవేశానికి సంబంధించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష –జేఈఈ అడ్వాన్స్–2024 పరీక్ష రేపు జరగనుంది.**

4. **గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో నిర్వహణపనుల దృష్ట్యా పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు సీనియర్ డీసీఎం ప్రదీప్ కుమార్ వెల్లడించారు.**

5. **విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి మే 27న హజ్ యాత్ర ప్రారంభమవుతుందని రాష్ట్ర హజ్ కమిటీ కార్యనిర్వహణాధికారి తెలిపారు.**

==========================

సార్వత్రిక ఎన్నికల ఆరో విడత పోలింగ్ కొనసాగుతోంది. ఆరు రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లోని 58 లోక్‌సభ స్థానాలకు ఓటింగ్ జరుగుతోంది. ఇందులో భాగంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సహా పలువురు ప్రముఖులు ఓటుహక్కు వినియోగించుకున్నారు. దేశ రాజధాని ఢిల్లీలోని స్థానిక పోలింగ్ కేంద్రంలో దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్ము తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ, ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

--------------------------

రాష్ట్రంలో జూన్ 4 వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనున్న క్రమంలో శాంతిభద్రతల పరిరక్షణ చర్యల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పోలీసు శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా కార్డెన్–సెర్చ్ తనిఖీల్లో భాగంగా పట్టణాలు, గ్రామాలు, అనుమానిత ప్రదేశాల్లో పోలీసు బలగాలు సోదాలు చేస్తున్నాయని పేర్కొంది. అక్రమ ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మద్యం మొదలైన వాటిని గుర్తించి స్వాధీనం చేసుకుంటున్నామని, సరైన పత్రాల్లేని వాహనాలను జప్తు చేస్తున్నామని వివరించింది. ఇప్పటివరకు 276 ప్రదేశాల్లో తనిఖీలు చేసి 24 కేసులు నమోదు చేశామని పోలీసు శాఖ పేర్కొంది.

--------------------------

ఐఐటీల్లో ప్రవేశానికి సంబంధించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష–జేఈఈ అడ్వాన్స్‌డ్–2024 రేపు జరగనుంది. ఈ పరీక్షకు దేశవ్యాప్తంగా 1.91 లక్షల మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ఈ పరీక్షకు సంబంధించి అభ్యర్థులకు ఇప్పటికే అడ్మిట్ కార్డులు విడుదలయ్యాయి. ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లో కంప్యూటర్ ఆధారితంగా పేపర్–1, పేపర్–2 పరీక్షలు జరగనున్నాయి. మొదటి విడత పరీక్ష ఉదయం 9 నుంచి 12 వరకు, రెండో విడత పరీక్ష మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాల నుంచి 5 గంటల 30 నిమిషాల వరకు జరగనుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుండి దాదాపుగా 46 వేల మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని అధికారులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో 26 కేంద్రాలు, తెలంగాణలో 13 కేంద్రాల్లో ఈ పరీక్ష జరగనుంది.

---------------------------

గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో నిర్వహణ పనుల దృష్ట్యా పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ – సీనియర్ డీసీఎం ప్రదీప్ కుమార్ వెల్లడించారు. గుంటూరు–డోన్, హుబ్లీ–విజయవాడ, కాచిగూడ–నడికుడి–కాచిగూడ రైళ్లను జూన్ 1 నుంచి 30వ తేదీ వరకు రద్దు చేసినట్లు తెలిపారు. డోన్–గుంటూరు రైలును జూన్ 1 నుంచి జులై 1వ తేదీ వరకు, విజయవాడ– హుబ్లీ రైలును జూన్ 2వ తేదీ నుంచి జులై 1వ తేదీ వరకు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. నర్సాపూర్ –గుంటూరు రైలును జూన్ 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు విజయవాడ–గుంటూరు మధ్య తాత్కాలికంగా రద్దు చేసినట్లు పేర్కొన్నారు. గుంటూరు–నర్సాపూర్ జూన్ 1 నుంచి 30వ తేదీ వరకు గుంటూరు విజయవాడ మీదుగా తాత్కాలికంగా రద్దు చేశామని, ప్రయాణికులు గమనించాలని ప్రదీప్ కుమార్ కోరారు.

---------------------------

ఫ్రాన్స్‌లో జరుగుతున్న 77వ కేన్స్ చలన చిత్రోత్సవంలో భారత్ చలనచిత్ర, టెలివిజన్ విద్యాసంస్థ– ఎఫ్.టి.ఐ.ఐ.కి చెందిన విద్యార్థి చిదానంద్ ఎస్.నాయక్ బృందం రూపొందించిన "Sunflowers were the first ones to know" చిత్రం 'లా సినెఫ్' అవార్డును గెలుచుకుంది. నిన్న జరిగిన ఉత్సవంలో విజేతను అధికారికంగా ప్రకటించారు. భారతీయ సినిమాకు ఇది చారిత్రాత్మక ఘట్టమని, భారతీయ సినిమాలు అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంటున్నాయని సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ పేర్కొంది.

---------------------------

సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో ఓట్ల లెక్కింపు కీలకమని ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపుపై అవగాహన కల్పించేందుకు విజయవాడ కలెక్టర్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కౌంటింగ్ కేంద్రాల్లో ఏజెంట్లకు కచ్చితమైన క్రమశిక్షణ ముఖ్యమని, ఎన్నికల ప్రవర్తన నియమావళి, గోప్యత నిర్వహణ పాటించాలని అన్నారు. జూన్ 4వ తేదీన ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని, ఏజెంట్లు ఉదయం 7 గంటల కల్లా కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. విజయవాడ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఏడు శాసనసభ నియోజవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 14 బల్లల చొప్పున ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

---------------------------

పర్యావరణ సమతుల్యానికి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కలిపించేందుకు మొక్కలు పెంపకం ఎంతో దోహదపడుతుందని ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పేర్కొన్నారు. నిన్న ఏలూరు నగరంలోని తంగెళ్లమూడి–

జంగారెడ్డిగూడెం రోడ్డు, సి.ఆర్.ఆర్. కళాశాల, అశోక్ నగర్, పంపుల చెరువు ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొక్కలు పెంచడం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని నివారించవచ్చని తెలిపారు. ఏలూరు నగరంలో మామిడి, జామ, నేరేడు, రావి వంటి 400 మొక్కలను నాటనున్నట్లు తెలిపారు.

---------------------------

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారతదేశం ప్రపంచంలో అగ్ర స్థానంలో ఉందని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ -ఇస్రో చైర్మన్ ఎస్. సోమనాథ్ పేర్కొన్నారు. ఇస్రో పరిధిలోని 7 కేంద్రాల్లో దృశ్య మాధ్యమ పద్ధతిలో నిర్వహించిన యువికా-2024 ముగింపు కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 353 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఎంపిక చేయగా, 51 మందిని శ్రీహరికోటలోని షార్ ప్రయోగ కేంద్రానికి పంపించారు. వీరందరికీ షార్ కేంద్రం సందర్శన, అంతరిక్ష ప్రయోగాలపై అవగాహన, అంతరిక్ష కార్యక్రమాలపై శిక్షణ, యోగా వంటి అంశాలపై అవగాహన కల్పించారు. నిన్న బెంగళూరు నుంచి దృశ్య మాధ్యమ పద్ధతిలో విద్యార్థులను ఉద్దేశించి ఇస్రో చైర్మన్ సోమనాథ్ మాట్లాడుతూ... శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ఆధునిక శాస్త్రవేత్తలుగా మారి దేశానికి గుర్తింపు తేవాలని పిలుపునిచ్చారు.

---------------------------

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి మే 27వ తేదీన హజ్‌యాత్ర ప్రారంభమవుతుందని రాష్ట్ర హజ్ కమిటీ కార్యనిర్వహణాధికారి అబ్దుల్ ఖదీర్ తెలిపారు. హజ్‌యాత్రకు సంబంధించిన ఏర్పాట్లపై హజ్ కమిటీ ప్రతినిధులతో నిన్న నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ, వివిధ జిల్లాల నుంచి 692 మంది ముస్లింలు హజ్ యాత్రకు వెళ్లనున్నట్లు చెప్పారు. 27వ తేదీ ఉదయం 8 గంటల 45 నిమిషాలకు 322 మంది, 28వ తేదీ సాయంత్రం 4 గంటల 55 నిమిషాలకు 322 మంది, 29వ తేదీ మధ్యాహ్నం 2 గంటల 50 నిమిషాలకు 48 మంది చొప్పున ప్రత్యేక విమానాల్లో హజ్‌యాత్రకు వెళ్తారని పేర్కొన్నారు. ప్రయాణ సమయానికి 6 గంటల ముందుగా విమానాశ్రయానికి చేరుకోవాలని అబ్దుల్ ఖదీర్ సూచించారు.

---------------------------

రాష్ట్రంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్ర అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ...

**......వాయిస్ 40 సెకన్లు.....**

---------------------------

రైతులకు నాణ్యమైన వేరుశనగ విత్తనాలను పంపిణీ చేయడం జరుగుతోందని అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. నిన్న జిల్లాలోని గుమ్మగట్ట మండల కేంద్రంలో వేరుశనగ విత్తన పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రైతుల సాగు భూమి విస్తీర్ణం బట్టి వేరుశనగ విత్తనాల బ్యాగులు పంపిణీ చేస్తున్నామన్నారు. పంపిణీ కేంద్రంలో రద్దీని నివారించేందుకు విత్తనాలను విడతల వారీగా అందిస్తున్నామని తెలిపారు. గుమ్మగట్ట మండలానికి 4 వేల 6 వందల క్వింటాళ్ల వేరుశనగ విత్తనాన్ని కేటాయించడం జరిగిందని, వేరుశనగ విత్తనాలను రైతుల సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

---------------------------

రైతుల కోసం కార్యక్రమాలను ప్రసారం చేసే డీడీ కిసాన్ ఛానల్ రేపటితో తొమ్మిదేళ్లు పూర్తి చేసుకోనున్న సందర్భంగా కృత్రిమ మేధతో నడిచే ఏఐ యాంకర్లను ప్రవేశపెట్టనున్నట్లు డీడీ కిసాన్ ఓ ప్రకటనలో తెలిపింది. ఏఐ క్రిష్, ఏఐ భూమి పేరిట వీటిని తీసుకురానున్నట్లు వెల్లడించింది.

======================